నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

గురువారం 7-11-2019    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    హైదరాబాద్ 3


## నమ్మలేని నిజాలు

బరువు బస్తా
వంద నుండి పాతిక
కంద లేదోయి.

పాల బుగ్గలు
ఫైన్‌లో కమురుకంపు
కన్నీటి గీతం

భార తీయత
మూడు రంగుల పువ్వు
గుండెలపైన

ఓటమి జయం
యుద్ధంలో ఒకరికే
శవాలే సాక్ష్యం

రంగు దివ్వెలు
తిమిరంతో సమరం
తూర్పు విజయం



– రేడియమ్
9291527757

## శ్రీనిజాలు

పట్టపగలె ఎమ్మార్వో
ప్రాణతనువు దహనమైంది!
విజయారెడ్డిహత్య, మన
విశ్వాసం బూడిదైంది!

రౌడీలూ గూండాలూ
అడుగడుగున పెరుగుతుండ్రు!
క్రూరమైన దుర్మార్గులు
ఘోరంగా చంపుతుండ్రు!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## మృగాళ్ళకు ఉరే సరి

విధులే ప్రాణాంతక బంధనాలై
అధికారమే ఆయువు కోరింది
కార్యాలయమే కాటిని తలపించింది
మానవత్వమే మంటగలిసింది
కుబుసం విడిచింది కుసంస్కారం
మాటలకందని క్రూరచేష్టల దుర్మార్గం
అవధుల్లేని అమానుష దహనకాండ !

ఆవేశాగ్నికి న్యాయమూర్తే ఆహుతి
విలవిల్లాడింది విజయమ్మ ఆదుకోమ్మని
అతివ ఆఖరి హాహాకార ఆర్తనాదాలు
సిగ్గుతో చచ్చింది సభ్యసమాజం
మనిషిలోని మృగమే పంజావిసిరి
మూర్ఖత్వమే మారణాయుధమని
మొండితనమే మగతనమనుకొని
మానమర్యాదల్ని బొందబెట్టి
దుచ్ఛేష్టలకే పురికొల్పే అమానవీయత
భస్మమైంది భావి జీవితం, నైతికత !

దురాగతదూర్తుల పీచమనచ
మరణదండనే మహామంత్రంగా
చట్టాల చట్రంలో బిగించి
మృగాళ్లను నిర్దయగా ఉరి తీసి
ఊపిరి పీల్చాలి మనందరం !

రాముని రాకకు నిరీక్షించక
మగువలంతా ధీర వనితలై
తెగువనే ఆయుధంగా చేబూని
దశఖంటులు రావణుల్ని వదించి
అవమానంతో దించిన తలల్ని
ధైర్యంతో తిరిగి ఎత్తి గర్వంగా నిలుపాలే !



– డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## రాక్షస క్రీడ

మానవత్వం మంట కలిసిన వేళా
రాక్షసత్వం వికృత క్రీడా
మనిషి మనుగడ జాడ ఏడ
నిద్రిస్తుంది విష వృక్ష నీడ...

చెప్పలేని మూగ వేదన
కలిగెను మదిలో ఆవేదన
శిక్ష లేకనే ఇట్టి నీచ కృత్యం
దిగజారుతున్నది నైతికత్వం

నీతికి నిలబడితే శిక్ష
మాట వినకుంటే శిక్ష
పని చేయకుంటే శిక్ష
ప్రాణం తీసుడేనా
ఎక్కడికి పోతుంది సమాజం
ఏమైపోతుంది నాగరికత!!
(అన్యాయంగా బలి అయిన
తాసిల్దార్ విజయ గారికి
నివాళిగా)



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## మనిషి జాడ

కసాయిల పడగ నీడన
కాలం వెళ్లదీయడమంటే
అనుక్షణం బతుకుతూ చావడమే
మృత్యువు ఏ రూపాన
మనల్ని కాటేస్తుందో
ఊహలకందని విషయమిపుడు
మనిషిని పశుత్వం
నిలువెల్లా ఆవహించినప్పుడు
చంపటం చావడం ఓ క్రీడ
తండ్రి ని కొడుకు చంపడం
అన్నను తమ్ముడు చంపడం
తల్లిని బిడ్డ చంపడం
భర్త ను భార్య చంపడం
భార్యను భర్త చంపడం

తన మాట వినలేదని
అధికారినే తగలబెట్టడం
వినీ వినీ
మనసు మొద్దు బారుతోంది
కరెన్సీ కల్చర్
స్వార్థంతో సహవాసం చేస్తూ
మనిషితనాన్ని సమాధి చేస్తుంది
మానవ విలువలను వెతకడమంటే
ఎండమావిలో నీటిని వెతకడమివాళ
ఆర్థిక సంబంధాలే
మనల్ని శాసిస్తున్నపుడు
మానవ సంబందాలెక్కడివి మన పిచ్చి గాని
మృగ్యమవుతున్న
మనిషి జాడను వెదకి పట్టగలిగే
పాతాళ గరిగె కోసం అన్వేషిస్తున్నా...



-సాగర్ల సత్తయ్య
7989117415

## సజీవ దహనం

కోపంలో
కళ్ళు మూసుకుపోయి
మెదడు
మొద్దుగా
మారుతుంది

క్షణికావేశం
యమ్మార్వో విజయరెడ్డిని కాల్చి
చంపింది

ఈ మానవ
మృగాన్ని కఠినంగా
శిక్షించండి–
ఉన్మాదుల
ముఠా నశిస్తుంది–
అమానుషం
శాంతిస్తుంది.



-యెల్డి సుదర్శన్ పద్మశాలి
సెల్:9892411067

### ముస్లింల జీవన స్థితిగతులకు వాస్తవ రూపం

# నస్రీన్ ఖాన్ కవిత్వం

ముస్లింల జీవన స్థితిగతులకు వాస్తవ ప్రతిరూపం' జఖ్మీ' అని ఆహూతులు పేర్కొన్నారు. ప్రముఖ కవయిత్రి, సీనియర్ జర్నలిస్టు నస్రీన్ ఖాన్ రచించిన ముస్లింవాద కవితా సంపుటి జఖ్మీ ఆవిష్కరణ కార్యక్రమం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంతో ఘనంగా జరిగింది. ప్రముఖ ముస్లింవాద కవి, రచయిత, ఉద్యమకారుడు స్కై బాబా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవయిత్రి నస్రీన్ ఖాన్ మాతృమూర్తి సైదాబి 'జఖ్మీ' పుస్తకాన్ని ఆవిష్కరించగా ప్రముఖ సినీ నటులు, పర్యావరణ ప్రేమికులు షఫీ, సీనియర్ రచయిత్రి షెహ్నాజ్, ప్రముఖ ముస్లింవాద కవయిత్రి, రచయిత్రి, తెలంగాణ తొలి విశిష్ట మహిళా పురస్కార గ్రహీత డాక్టర్ షాజహానా, ప్రముఖ దళితవాద కవి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, సీనియర్ కవి, కవిసంగమం స్థాపకులు, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘం సభ్యులు డాక్టర్ యాకూబ్, ప్రముఖ కవి, విమర్శకులు, తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి కటుకోజ్వల ఆనందాచారి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, స్ప్రెడింగ్ లైట్ నిర్వాహకులు పి.జ్యోతి తదితరులు వక్తలుగా హాజరైన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.



సభలో 'జఖ్మీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

కార్యక్రమంలో ముందుగా పసునూరి రవీందర్ మాట్లాడుతూ తాను రాసిన ఔటాఫ్ కవరేజ్ ఏరియాలోని పరిస్థితులు ముస్లింలకు కూడా వర్తిస్తాయి అన్నారు. ముస్లింల బతుకు చిత్రాలన్నీ ఆవిష్కరిస్తూ...

'గల్లీ చిన్నదీ గరీబోల్ల కథ పెద్దది' అంటూ ప్రజాకవి గోరటి వెంకన్న పాటను ఉటంకించారు. ముస్లింల బతుకులెందుకు చిన్న చిన్న గల్లీల్లో, పాన్ షాపుల కన్నా చిన్నగా ఉండే ఇళ్ళలో గడుస్తున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సచార్ కమిటీ ముస్లింల స్థితిగతుల మార్పుకై నివేదికలు సమర్పించినా చలనం లేని పాలకుల మధ్య ఉన్నామన్నారు.

ఆంక్షల నడుమ గడిపే ముస్లిం మహిళలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఆవశ్యకతను నస్రీన్ ఖాన్ తన కవితల్లో ఆకాంక్షించారన్నారు. ఆమె రాసిన కవిత్వం సామాజిక మార్పును కోరే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు.

అనంతరం నస్రీన్ ఖాన్ కవిత్వాన్ని జ్యోతి విశ్లేషించారు. ముస్లిం జీవన విధానానికి, ముస్లిం మహిళలు తెర వెనుకే ఉంటూ నిత్య శ్రామికలుగా ఎలా ఉంటారో తన కవితల్లో ఆవిష్కరించారన్నారు. తెలుగు భాషలో రాసినప్పటికీ ఉర్దూ పదాలు తీసుకొచ్చిన శబ్దసౌందర్యం అద్భుతంగా ఉందన్నారు. రచయిత్రి షెహ్నాజ్ మాట్లాడుతూ తాము రచనలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. ముస్లిం అమ్మాయిలు హిజాబ్ ధరించినప్పటికీ తాము అనుకున్నవి సాధించడంలో వెనుకాడటం లేదన్నారు. తాను కార్పొరేటర్ గా పని చేశానని, ఇప్పటి కాలంలో పైలట్ గా కూడా అమ్మాయిలు ఉంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇంకా మరింత ముందుకు రావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. షాజహానా మాట్లాడుతూ ముస్లిం వాదానికి నస్రీన్ గొంతుక బలమైన చేర్పు అని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో మరిన్ని పుస్తకాలు రాస్తారని ఆకాంక్షించారు. కవి యాకూబ్ మాట్లాడుతూ అమెరికా వలస వాదులను వెళ్ళగొట్టేందుకు అక్కడి పాలకులు జరుపుతున్న దాడి, వలసవాదుల జీవితాల్లో ఎటువంటి సంఘర్షణను నెలకొల్పుతుందో అటువంటి ఘర్షణ నస్రీన్ కవిత్వంలో ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆనందాచారి మాట్లాడుతూ కవయిత్రి నస్రీన్ ఖాన్ రాసిన తెలుగు, ఉర్దూ భాషల సమ్మిళిత శైలి మన రాష్ట్ర హిందూ ముస్లింల సహజీవనానికి ప్రతీక అని కొనియాడారు. నస్రీన్ ఏదైతే ఆలోచిస్తుందో తన కవిత్వంలోనూ ప్రతిఫలిస్తుందన్నారు. ఆమె రాసేదే ఆమె మాట అయి ఉండడం తక్కువ రచయితల్లో కనిపిస్తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## లేతగులాబీ రేకుల్లారా! రేపటి భారత తారల్లారా!

లేత గులాబీరేకుల్లారా!
రేపటి భాగ్యవిధాతల్లారా!
ఇది మీ పిల్లల పండుగ రండీ
నెహ్రూతాత కథ వినరండి!

మోతీలాల్ స్వరూపరాణుల
ముద్దులతనయుడు చాచా!
గాంధీ మార్గంలో చరించిన
ఘనచరిత్రగల నేత!

లేత గులాబీ రేకుల్లారా!
రేపటి భారత క్రాంతుల్లారా!
మీదే మీదే భారత దేశం
ఆచరణే మీ సందేశం!

అలీనదేశపు నవీన సారథి
మనజవహరుతాత!
పంచశీల నిర్మాణ శిఖరమై
నిలచె శాంతిదూత!

లేత గులాబీ రేకుల్లారా!
చాచా హృదయ గీతికలారా!
కులమత భేదం లేని రాజ్యమును
తీసుకురండీ దూతల్లారా!

పచ్చని పొలాలు కలగన్నారు
మననెహ్రూ తాత గారు!
పరిశ్రమలనే నెలకొల్పారు
మన నెహ్రూ తాత గారు!

లేతగులాబీ రేకుల్లారా!
రేపటి భారత తారల్లారా!
గగనంలో నింపాలిశాంతి కపోతాలు
మీరంతా కావాలి క్రాంతి పూరితాలు!

పూర్ణ స్వరాజ్యం కలగన్నాడు
జవహర్ పండితుడు!
సమసమాజ నిర్మాణం కోసం
కృషి జరిపిన వందితుడు!

లేతగులాబీ రేకుల్లారా!
చేతన పూరిత లేఖల్లారా!
అక్షర గంధం పంచండి భారత
రక్షణ వలయం మీరండీ!



-కిలపర్తి దాలినాయుడు
7780589336

## అయ్యో నా కవితా!

భావాలను కోల్పోయి
అక్షరమై మిగిలావా!
భారమైన పోలికలతో
పొలికేకలు పెట్టావా!
ఎంత వచనమైనా
ఇంతగా పచనమైపోయావా!
అతకలేని అర్థాలతో
ముక్కలు కాబడ్డావా!
చెల్లాచెదరై పగిలి
గుండె చిక్కబట్టావా!
దారీతెన్నూ మరిచి
తీరును కోల్పోయావా!
వస్తురూపమేదైనా
వాస్తవికత వదిలావా!
నిన్ను నిన్నుగా మిగల్చని
కలాల దాడిలో కర్పూరమై రగిలావా!
నీ జాడ వెదుకు కళ్ళల్లో
వాడిన తలపై పొగిలావా!
దారితప్పిన గమనంతో
పారిపోవ నెంచావా!
నిట్టనిలువుగా చీల్చబడి
మట్టిగొట్టుకు పోయావా!
సాహిత్య లోక స్వప్నాలకు కపిత్వాన్ని పూసి
సామాజిక స్పృహను వీడి
చావుబ్రతుకుల నడుమ
కొసప్రాణాలతో
కొట్టుమిట్టాడుతున్నావా?!



దేగల అనితాసూరి
9247500819

# మహారాష్ట్ర మరో ధమాకా...

తెలుగు సాహిత్యాన్ని నలుదిశలా వ్యాపింపజేయడానికి మహారాష్ట్ర తెలుగు కళా సమితి ఎంతో పాటుపడుతున్న సంగతి తెలుగు పాఠకులకు విదితమే. ఒక సంకల్పం ఎంతటి దృఢత్వాన్ని, కార్యశూరత్వాన్ని ఇవ్వగలదో వీరు గడచిన కాలంలో ప్రచురించిన గ్రంథాలను గమనిస్తే మనకు అర్థమవుతుంది. తెలుగు భాష, సంస్కృతి, కళల పరిరక్షణలో వీరి నలభై దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం అనేక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించిందన్నది అందరికీ విదితమే. నేడు మరో ఆవిష్కరణ "మహారాష్ట్ర తెలుగు రచయితల కథా సంకలనం" మన ముందుకొచ్చింది. ముఖ్యంగా మనం ఏదైనా సాధించాలన్నా, ఒక సంస్థ నిలబడాలన్నా, ఒక పని విజయవంతంగా ముందుకు నడవాలన్నా నడిపే వ్యక్తుల్లో నిర్దిష్టత ఉండితీరాలి. ఆ నిర్దిష్టత తెలుగు కళాసమితి కార్యవర్గంలో ఉంది. రాష్ట్రం ఏద యితేనేం? గుండెలో సత్తువ ఉంటే ఏదైనా సాధించవచ్చు అనే విషయం ఈ గ్రంథం చదివితే మనకు అర్థమవు తుంది. ఎందుకంటే ఇందులోని 31 కథలు ఒక్కో మైలురాయి.

భర్త ప్రేమను అర్థం చేసుకోకుండా నిత్యం ఏదో తనకు తక్కువ చేస్తున్నాడని, తనపై ప్రేమ ఇదివరకటిలా లేదని, ఏ పనిచేసినా తనను కించపరిచేలా ఉందని, తన మాటకు విలువ నివ్వలేదని సాధించే భార్యలకు అద్భుతమైన సమాధానం కెవివి. సత్యనారాయణ గారి కథ **"శివుడు సగమే మరి.."** నిజంగా ప్రతి భార్య చదవాల్సిన కథ ఇది.





టెక్నాలజీ అనేది నేడు భావితరాలకు ఎంతో అవసరం. కానీ అవసరమైనవి వదిలేసి, పనికిమాలిన వాటికి ఉపయోగిస్తూ, తద్వారా తమ ఆలోచనల్ని అథోపాతాల్లోకి నెట్టేస్తూ చేస్తున్న ఘాతుకాలు ఎన్నో ఈ ప్రపంచంలో. అదే అంశాన్ని తురగా జయశ్యామల వారు రచించిన **"ఎవరిదీ బాధ్యత"** అనే కథలో వివరించారు. చెల్లి అయినా ఆడది ఆడదే కదరా అన్న ఒక స్నేహితుడు మాటను విని తప్పుగా ప్రవర్తించిన తన కొడుకును ఎలా సరిచేసిందో, అసలు ఆ కొడుకు అలా అయిపోవడానికి కారణం ఎవరో? అని గ్రహించి, ఎందరికో కనువిప్పు కలిగించిన కథ ఇది.

కాలం తెచ్చే మార్పులకు భయపడి, తాను ముసలివాడయిపోతున్నాడని బాధపడే ఒక తండ్రి ఆవేదనలో మార్పు ఎలా వచ్చింది అనే విషయాన్ని తెలిపే కథ సంగవేని రవీంద్ర కథ "మార్పు" నిజమే. ముసలితనం వచ్చేస్తోంది. ఇప్పుడు ఇక నన్నెవరూ ఇష్టపడరేమో అనే భయంతో చాలామంది నేడు జుట్టుకు రంగు వేసుకుని, మేకప్పులు వేసుకుని తిరుగుతుంటారు. కానీ ముఖంలో కనిపిస్తున్న మార్పుల్ని ఎవరు ఎలా మార్చగలము? అనేది ఆలోచించరు. అలాగే పొన్నూరి భారత లక్ష్మి రచించిన **"ఆడపిల్ల ఆవేదన"**, పుల్లాభట్ల జగదీశ్వరి రచించిన **"సహజీవనం"** అద్దంకి లక్ష్మి రచించిన **"సాఫల్యం"** బుదారం రేణుక రచించిన **"సంతాన దుర్గ"**, దోమల జనార్ధన్ రచించిన **"ఐదుగు జీవులు"** పి. హెచ్. త్యాగరాజు రచించిన **"వదినమ్మ పెట్టిన సారె"** కథలు ఎంతో అర్థవంతంగా సాగాయి. సమకాలీన సమాజంలో నేడు ఎంతో మంది అనుభవిస్తున్న ఆవేదనలకు ప్రతిరూపాల్లా సాగాయి. రెండు నాణాలు ఇవ్వగానే అడుక్కుంటున్న బిక్షగాని ఆనందాన్ని వివరించిన రవీనా చవాన్ కథ **"బికారి"** డా|| మూర్తి రచించిన **'వాషిలో ఓ సాయంత్రం'** అనే కథలు ప్రత్యేకతను చాటుకున్నాయి. బండారు శేషాద్రి రచించిన **"రేపటి తండ్రి"** అనే విషయం కార్టూన్లుగా నిత్యం కనిపిస్తూనే ఉంటుంది.. కమలాకాంత్ కథ 'స్నేక్', యెల్డి సుదర్శన్ పద్మశాలి కథ "హే రామ్" కథలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. జక్కని గంగాధర్ రచించిన "బొడ్లో సంచి" కథ సరదాగా అనిపించింది. తాతిరాజు లక్ష్మీ వేణుగోపాల్ రచించిన కథ **"మనమింకా మద్రాసీలమేనా"**, గాలి మురళీధర్ **"శాస్త్రోపనిషత్"** కథలు ఎంతో ఆసక్తి కరంగా సాగాయి. వస్తువు ఎంపికలో వారు తీసుకున్న జాగ్రత్త మనం గమనించవచ్చు. మొత్తానికి కొందరు ప్రముఖులు, కొందరు వర్ధమాన కథకులతో సరికొత్త కథల్ని ఒకచోటగా చేర్చి పాఠకులకు అందించిన సంపాదకీయుల ప్రయత్నం ఎంతో హర్షణీయం.

**కథ ఇలా ఉండాలి.. అలా ఉండాలి. ఇలానే ఉండాలని స్కేలు, గళ్ళు గీసినట్లు నిబంధనలు ఏవయినా ఉన్నాయా అంటే ముమ్మాటికీ లేవు. కాకుంటే కథకు మొదలు ఎలా ఉన్నా, ముగింపులో మాత్రం పాఠకుడు తృప్తిపడేలా ఉండాలి.**

కథ ఇలా ఉండాలి.. అలా ఉండాలి. ఇలానే ఉండాలని స్కేలు, గళ్ళు గీసినట్లు నిబంధనలు ఏవయినా ఉన్నాయా అంటే ముమ్మాటికీ లేదవు. కాకుంటే కథకు మొదలు ఎలా ఉన్నా, ముగింపులో మాత్రం పాఠకుడు తృప్తిపడేలా ఉండాలి. సందిగ్ధంగా, సంశయంగా ప్రశ్నలా, ఒక వార్తలా ఉండకూడదనేది మాత్రం ప్రముఖ కథకులు చెప్పిన సందేశాలు. సమస్యలకు భయపడి జీవితం నుండి పారిపోయే వారికి దారి దొరకాలి. ఆవేదనతో నలిగిపోయేవారికి ఆలంబనగా నిలవాలి అంతే.. 31 మంది రచించిన కథలు దాదాపుగా అన్నీ మెచ్చుకోద గినవే. మహారాష్ట్రలో తెలుగువారు సాహిత్యం పట్ల చేస్తున్న కృషి, సంపాదకులుగా వ్యవహరించిన బండి నారాయణ రెడ్డి, మాదిరెడ్డి కొండారెడ్డి, సంగవేని రవీంద్ర గార్ల ప్రయత్నం ఎంత బావుంది అంటే ఈ గ్రంథం చూసిన వారందరూ తాము అక్కడెందుకు ఉండలేకపోయాము అనిపించేలా ఉంది.. రచయితలందరికీ అభినందనలు..

ప్రతులకు: తెలుగు కళా సమితి,
ప్లాట్ నెం: 13, సెక్టార్–9ఏ, వషి,
నవీ ముంబయి–400 703
వెల: 200/-, పేజీలు: 208

–శైలజామిత్ర
9290900879


ఆహ్వానం
జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ
ప్రతిభ & ఆప్తమిత్ర
పారితోషక పురస్కారాల ప్రదానోత్సవం

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | "పద్మశ్రీ" ఆచార్య కొలకలూరి ఇనాక్<br>పూర్వ ఉపకులపతి, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి. |
| సభాధ్యక్షులు | : | లయన్ డా|| చిల్లా రాజశేఖర రెడ్డి<br>స్థాపకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆర్య |
| సభాప్రారంభం | : | డా|| శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి<br>అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ |
| అతిథులకు జ్ఞాపికల బహూకరణ | : | శ్రీ లంక పణికుమార్ శర్మ, స్థాపక అధ్యక్షులు<br>సర్వేజనా సుఖినోభవంతు సేవా సమితి, హైదరాబాద్ |
| అతిథి స్వాగత సత్కారం | : | శ్రీ సయ్యద్ జాని భాషా<br>కవి, రచయిత గుంటూరు |
| నిర్వాహణ | : | శ్రీమతి పద్మశ్రీలత<br>కవయిత్రి, రచయిత్రి |

సాంస్కృతిక కార్యక్రమాలు.
శ్రీఆర్. సైదులుచే జానపద, దేశభక్తి గీతాల ఆలాపన
డా|| ఎ. శ్రీనివాసరెడ్డి గారిచే
మానసిక వత్తిడి - ధ్యానం అంశాలపై ప్రసంగం

15-11-2019 శుక్రవారం సా|| 6 గంటలకు
కళాసుబ్బారావు కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్

జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
లయన్ గుదిబండి వెంకటరెడ్డి, చైర్మన్
లయన్ వి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి

శ్రీ త్యాగరాయ గానసభ
శ్రీమతి కళా శారద దీక్షితులు
ప్రధాన కార్యదర్శి

ప్రతిభ పురస్కార స్వీకర్తలు

అభినందన నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం
సర్గీయ కళావేంకట దీక్షితులు జ్ఞాపకార్థం
మిత్రుడు శ్రీ గుదిబండి వెంకటరెడ్డి నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీమతి కత్తుల లక్ష్మి, సేవారంగం,(వర్ధన్ అనాధ ఆశ్రమం, జనగాం)
డా|| రామరాజు శ్రీనివాసరావు (గుంటూరు) నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
'తెలుగు కోకిల' భూదేవి - గాయని
శ్రీ సయ్యద్ జానీ భాషా
(గుంటూరు) నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీ సయ్యద్ జహీర్ అహ్మద్, రచయిత, కర్నూలు
"జ్ఞాన పీఠ" పురస్కార స్వీకర్త డా|| రావూరి భరద్వాజ జ్ఞాపకార్థం
కుమారుడు శ్రీ రావూరి వెంకట కోటేశ్వర రావు ఔత్సాహిక రచయితకు
నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీ పెద్దోజు నాగేశ్వర రావు, రచయిత

ఆప్తమిత్ర పారితోషిక స్వీకర్తలు

శ్రీమతి యం. సీతా కుమారి నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
కుమారి యస్. సంధ్య, డిగ్రీ ప్రథమ సంవత్సరం
(వర్ధన్ అనాధ ఆశ్రమం, జనగాం)
సర్గీయ కళ్లం వెంకట రెడ్డి – స్వర్గీయ విజయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం
అల్లుడు డా|| ఎ. శ్రీనివాసరెడ్డి నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీ ధనుష్, 9వ తరగతి (వీధి బాలుడు, అప్జాపుర్)


## నిశ్శబ్ద విప్లవ దీపం

సీమ టపాకాయలు
ఔట్లు
తారాచువ్వలు
మతాబులు...
ఎన్నెన్నో వచ్చాయి
మేమే వీరుల మని,
ఇరులను నరికేసే ధీరుల మని...
అన్నీ కుప్పకూలిపోయాయి...

నెమ్మదిగా దీపాలు వచ్చాయి,
నిశ్శబ్దంగా చీకటిని చీల్చాయి.



-డా. రావి రంగారావు
9247581825

## అపకీర్తి

ఆడపిల్లగా
అణుకువతో
పుట్టినింటకి మెట్టినింటికి
కీర్తి తెస్తావనుకున్నా!

ప్రేమమాయలో పడి
కన్నతల్లినే కడతేర్చావా
ఆడది సిగ్గుపడేలా!

కట్టుబాట్లను
ముళ్లకంచెలనుకున్నావా!
తల్లిదండ్రుల ఆంక్షలను
హద్దులనుకున్నావా!

ప్రియుడితో
పన్నాగం పన్ని
ఆడతనానికే
అపకీర్తి తెచ్చావా!
రేపటితరానికి
ఏం సందేశమిద్దామని!



-అయిత అనిత
8985348424

## సర్దార్ పటేల్ జీవితం ఆదర్శనీయం





సర్దార్ పటేల్ జయంతి సభలో పాల్గొన్న అతిథులు.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటీష్ వారిని ఎదురించిపోరాడిన ఉక్కు మనిషి, ధైర్యశాలి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని అక్టోబర్ 31,గురువారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో లలిత కళావేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానాన్ని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతుందని, కేంద్ర హెూంశాఖమంత్రిగా దేశంలోని అనేక సంస్థానాలను విలీనం చేసిన పటేల్ జీవితం ఆదర్శ ప్రాయమైందన్నారు. సభలో పాత్రికేయులు శంకర్ నారాయణ, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, కళా జనార్ధనమూర్తి, గాయకులు ఎం.వి. రాఘవాచార్యులు, రేణుక తదితరులు పాల్గొన్నారు.



**బాలల దినోత్సవం సందర్భంగా 'మొగ్గలు' ప్రక్రియలో బాలల గురించి కవుల స్పందన.**

-సంపాదకులు.

పిల్లలు తమ నువ్వులను తెంపుకొచ్చి
ఇంటిల్లిపాదికి దుఃఖాన్ని దూరం చేస్తారు
చీకటిని తుంచి వెలుగును పంచే నేస్తాలు పిల్లలు

పసిపాపల నవ్వులు ముద్దాడిన చోటల్లా
సంతోష నక్షత్రాలు తానమాడి పోతాయి
పసిపాపల ముద్దులు వాడిపోని పువ్వులు

కల్మషంలేని హృదయాల నిలయమే
పసిపాపల నవ్వుల ఆలయము
పసిపాపల నవ్వులకు పరవశించే స్వర్గం

నా ఎద ఎనుక ఎతనంత చిట్టితల్లి
నాన్న అనే పిలుపుతో కరిగిస్తది
పసిపాప పిలుపుకు రాలిపోతుంది ఎత

ఘల్లుఘల్లు గజ్జెలతో నీవు గంతులేస్తుంటే
కోట్లిచ్చిన కొనలేని ఆనందాన్ని పొందుతాము
చిట్టికాళ్ళ గజ్జెలసవ్వడే సంతోష సాగరం



– బోల యాదయ్య
99122 06427

కిలకిలమనే నవ్వులతో పరవశింపజేస్తూనే
అందరి మనసులను చూరగొంటారు
చిన్నారులు ఆనంద దీపావళులు

సత్యహరిశ్చంద్రుని బాటలో నడుస్తూనే
ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకుతుంటారు
సత్యానికి నిదర్శనాలు బడిపిల్లలు

కల్మషం ఎరుగని మనసులతో
కలకాలం నీతితో బతుకుతారు
సహృదయానికి ప్రతిరూపాలు పిల్లలు

భారతదేశ తొలిప్రధానిగా ఉంటూనే
చాచా అనే పిలుపుకు బందీ అయ్యాడు
చాచానెహ్రూ పిల్లలందరికీ ఆత్మీయనేస్తం

పిల్లలంటే అధిక ప్రాణమించినందుకే
బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు
చాచానెహ్రూ ఎప్పటికీ బాలలకు బంధువు



– యం.డి.సనా అర్షిన్
10 వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల బుర్దపేట,
గద్వాల జోగులాంబ గద్వాల జిల్లా
9948948787

కల్లాకపటం లేనివారి మాటలు వింటుంటే
మనసుకి ఎంతో ఆనందం కలుగుతుంది

బాలలమాటల్లో ఎప్పుడు కల్మషంలేని ప్రేమే
పుస్తకాల సంచిని భుజాలపై మోస్తూ
ఆనందంగా బడిబాట పడతారు బాలలు
నేటి కష్టమే రేపటి ఆనంద జీవితం

పసిపిల్లల సిరినవ్వులు చూస్తుంటే
మదిలో తెలియని ఆనందాల పువ్వులు పూస్తాయి
పిల్లల నవ్వులు ఆనందానికి ప్రతిరూపాలు

పడుతూ కూడా లేచి నడవాలనే
పిల్లల ప్రయత్నం ఎంతో గొప్పది
పడినసరే నడిచేవరకు ఆగరు బాలలు

పొద్దంతా అలిసిపోయి ఇంటికి వచ్చినవారికి
పిల్లల నవ్వు చూడగానే కష్టమంతా మాయమైతది
కష్టంమోసిన కాయం నవ్వులతో సేదతీరే చెలిమె



– అనుపటి హేమలత
8886878207

పసిడినవ్వుల బాలలు ఎప్పటికీ
వికసించిన అందమైన పువ్వులు
బోసినవ్వుల పిల్లల ఇల్లు స్వర్గం

ఆకాశాన మెరిసే నక్షత్రాలు ఎప్పటికీ
పసిబాలల కన్నులలో మెరిసే తారలు
అంధకారాన్ని పారద్రోలే దివ్వెలు బాలలు

బాలలు పసిమొగ్గల మబ్బుతునకలవుతూ
వీనులవిందుగా వింజామరలు వీస్తారు
బాలలు తూనీగల్లా సందడిచేసే పూరెక్కలు

చల్లని మనసున్న పిల్లలందరూ
ఆ దేవుని యొక్క ప్రతిరూపాలు
అందరి మదిలో వెలుగొందే చిరుదివ్వెలు

తాయిలాలకు చాచే చేతులవుతూ
తారంగాలు ఆడే తువ్వాయిలు
తాపరభేదమెరుగని ముద్దులపాపలు



– రమాదేవి బాలబోయిన
6281216735

అమ్మ ఒడిలో అక్షరాలు దిద్దుకుని
బడిలో జీవిత పాఠాలు నేర్చుకుంటారు
నేటి బాలలే కదా రేపటి పౌరులు

పసిప్రాయంలోనే సంస్కారగంధాన్ని అద్ది
భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి
బాలలే భావితరాలకు సంస్కారవారధులు

కన్నవారి కలలను పండించే కనుపాపలవుతూ
అక్షరకుసుమాలను వెదజల్లే ప్రతిభావంతులవుతారు
బాలలు చదువులమ్మ వెలిగించిన చిన్నారులు

ప్రేమాభిమానంతో చేరదీసి ఆప్యాయతతో విద్యనేర్పితే
ఉత్తమ ఫలితాలతో జగతిలో కీర్తిని చాటుతారు
విద్యార్థులే ఉపాధ్యాయుల పనితనానికి నిదర్శనాలు

కల్లాకపటమెరుగని చిన్నారుల నవ్వులు
శాంతిదూత ఎదపై నిలిచిన గులాబీ పువ్వులు
చాచానెహ్రూకి పిల్లలే కదా ప్రాణం ఎప్పటికీ



– గొండ్ల వీరమణి
9912540101

మహాత్ముని ఆశయాలకు ఆనవాళ్ళవుతూ
నెహ్రూ ప్రేమానురాగాల పరిమళాలవుతారు
బాలలు భవితవ్యానికి వెలుగు దీపికలు

వివేకానందుడి బాటలో వివేకులవుతూ
కలాం శాస్త్ర కదనంలో విజ్ఞానకర్తలు వాళ్ళు
బాలలు రేపటి నవయుగ పిడుగులు

మోడి దేశభక్తి తత్పరతకు సేవకులవుతూ
అభినందన్ ఆదర్శ ధర్మానికి అంశలవ్వాలి
బాలలు భారతావని గర్వించే గాండీవాలు

మదర్ థెరిస్సా సేవాప్రపంచానికి సైనికులవుతూ
సావిత్రీబాయ్ పూలే పటిమకు ఆదర్శంగా నిలవాలి
బాలలు రేపటి లోకాన్ని ఏలే ధృవతారలు

అంబేద్కర్ రాజ్యాంగస్ఫూర్తిని నింపుకుని
తెలంగాణ ఉద్యమకవి కాళోజిలా కవితలల్లాలి
నేటి బాలలు రేపటి భావిభారత నిర్మాతలు



– జి.శాంతారెడ్డి
8008177325

అమ్మచేతి గోరుముద్దలతో కడుపు నింపుకొని
అనురాగపు వాహినిలో హాయిగా ఓలలాడుతుంది
బాల్యం ఆప్యాయతానురాగాల ఆత్మీయబంధం

చిటికెనవేలు పట్టుకుని బుడిబుడి అడుగులు వేస్తుంటే
తప్పటడుగులు వేయకుండా వెన్నంటి ఉండేది నాన్న
బాల్యం ఎదుగుదలకు భరోసా నిచ్చేది నాన్న

బాల్యంలో చిలిపిచేష్టలు, చెడుగుడు ఆటలు
జీవితంలో మరిచిపోలేని మరపురాని తీపిగుర్తులు
బాల్యం మధురానుభూతుల సంగమం

అరమరికల్లేకుండా కల్లాకపటం తెలియకుండా
ఎగురుతూ గెంతుతూ ఊహాలోకంలో విహరించేది
బాల్యం స్వేచ్ఛానురాగాల సంబోధన సరాగం

అష్టాచెమ్మలు,అచ్చెన్నగూళ్ళతో విరబూసిన ఆటలు
ఆనందపు లోగిళ్లలో గడిచిన మరపురాని ఊటలు
బాల్యం తీపికలల మహిద్భుత ఊహా ప్రపంచం



– రవి చంచల
8500330700

అప్పుడప్పుడే విచ్చుకుంటున్న మొగ్గలై
పసితనపు పరిమళాలను వెదజల్లుతారు
అల్లరి కుసుమ పరాగాలు బాలలు

అనుకరణ శక్తి మిక్కుటముగా కలిగి ఉండి
పెద్దల ప్రవర్తనను అనునిత్యం అనుసరిస్తారు
కల్లకపటమెరుగని స్వచ్ఛముత్యాలు బాలలు

తెల్ల కాగితమంటి తమ మనసుల్లో
గురువులు చెప్పిందే వేదంగా లిఖిస్తారు
నమ్మకపు వాకిట్లో రంగవల్లులు బాలలు

సన్మార్గాన్ని చూపిస్తే సచ్ఛీలురవుతూ
దేశ భవితకు అసలైన వారసులవుతారు
నేటి బాలలే భావిజీవితంలో పౌరులు

ఆత్మీయంగా దరికి తీస్తూ ధర్మం బోధిస్తే
సమసమాజ నిర్మాణానికి వారధులవుతారు
నేటి బాలలే దేశాభివృద్ధికి సోపానాలు



– అయిత అనిత
8985348424

గురువు చేతి అక్షరపు ముద్దలవుతూ
ఆయన బోధనల ప్రభావితబాణాలు వాళ్ళు
బాలలే భావితరాల భవిష్యత్తుకు వెలుగులు

జగతితలపై భారత ఘనతను చాటుతూ
పసిడిసిరాతో రాసే వ్యాసకర్తలు బాలలు
పిల్లలు భారతదేశపు గౌరవ ప్రతిబింబాలు

నివురుగప్పిన నిప్పుతునకల సమాజంలో
అన్నెంపున్నెమెరుగని స్వేచ్ఛావిహంగాలు పిల్లలు
అభద్రత సమాజపు అందమైన పువ్వులు బాలలు

అలుపెరుగని జీవితపు ప్రయాణంలో
అమాయకత్వపు అల్లరినవ్వుల జాడలు
చిట్టిప్రపంచపు చిరునవ్వులు పిల్లలు

నవ్వులొలికే పాలనురగల పసితనమే
పడిలేచే కడలి అలల్లా ఎగిసే తరంగాలు
బాల్యంలో వేసే ప్రతి అడుగు భవితకు వెలుగు



–కమ్మరి శిరీష



విజ్ఞాన విపంచికలై విరాజిల్లుతూ
జ్ఞానతరంగాలను గగనమంతా ప్రసరింపచేస్తారు
బాలలు భవ్యభారతికి ప్రగతి రథసారథులు

స్నేహ సుగంధాలను ఒడిసి పట్టుకొని
ఆత్మీయ రాగాలాపనతో వర్షిస్తారు
బాలలు మైత్రీవనాన వసించే మైత్రేయులు

సెలయేటిలా స్వచ్ఛమనస్కులవుతూనే
కలివిడితనానికి కాణాచిలా జీవిస్తారు
బాలలు ఇజాలకు లోబడని నిప్పుకణికలు

నవ్వుల నజరానాను ఆనందంగా అందిస్తూనే
దేశమాత మోమున సంతసాన్ని పల్లవింపచేస్తారు
బాలలు ఆనందానికి అసలైన ప్రతిబింబాలు

పరిస్థితులు ఎప్పుడు ప్రతికూలించినా
వెన్నుచూపక నూత్నజవసత్వంతో అంకురిస్తారు
బాలలు భావితరాన్ని శాసించే శాసనకర్తలు

లక్ష్యసాధనకై అంతర్మథనం చేస్తూనే
దృఢచిత్తంతో నిరంతరం పోరాటం చేస్తారు
బాలలు మడమతిప్పని కార్యసాధకులు



–డా.బాదేపల్లి వెంకటయ్యగౌడ్
9948508939

బోసినవ్వుల బుజ్జిపాపాయిలెప్పుడూ
పరమాత్ముని యొక్క ప్రతిరూపాలు
బాలలు నిజమైన పరబ్రహ్మ స్వరూపాలు

మొక్కెపుడూ ఒంటరిగానే ఎదుగుతూ
పదిమందికి నీడనిచ్చే పందిరవుతుంది
చదువు వెలుగునిచ్చే చలువపందిరి

ఊరి మధ్యలో ఓ నందనవనమవుతూ
పాఠశాల బృందావనంలా పరిమళిస్తుంది
రకరకాల పూలమొక్కల తారలు బాలలు

చక్కనైన బడిలో సీతాకోకచిలుకలవుతూ
చదువులమ్మ ఒడిలో సేదతీరే చెలిమెలు
ఎప్పటికీ తనివితీరనిది చదువు ఒక్కటే

విద్యార్థులు ఓటములు పొందిన ప్రతిసారీ
వారిని నిందించక వెన్నుతట్టి ప్రోత్సహించాలి
విజయానికి మార్గం ఓటమేనని బోధనం



– సిహెచ్. శ్యామల
9949831146

ఇంటికి పునాదులు ఎలాగో
భవిష్యత్ తరానికి బాల్యం అలాంటిది
భావిభారతానికి భరోసా బాల్యం

వారి నవ్వులోనే కాదు వారి మాటల్లో కూడా
కల్మషం అన్నదానికి స్థానం ఉండదు
బాలలు కల్మషం ఎరుగని ప్రవక్తలు

ఆస్తి అంతస్తులు కన్నా అమ్మ ప్రేమ కోసమే
ఆరాటపడే సూక్ష్మబుద్ధిపరులు చిన్నారులు
అమ్మ అనురాగమే చిన్నారులకు అమృతం

ఎన్నోసార్లు నోములు నోస్తేనే కదా
బాల్యం బహుమానమై అంది వస్తుంది
తల్లిదండ్రుల పుణ్యఫలమే బాల్యం

చిలిపితనం చిందులాడినప్పుడే
పిల్లల అల్లరిని ఆస్వాదించవచ్చు
వారి అల్లరే ఒక అద్భుత దృశ్యం



– కె.రాధికారాణి
9182382611

బంగారు బాలలు చదువుకు నోచుకోక
కుటుంబభారాన్ని చిట్టిచేతులతో మోస్తున్నారు
ఆదుకొనే అండలేక అన్యాయమై పోతున్న బాలలు

చిత్తుకాగితాల వేటలో పడి పోరాడుతూ
బంగారు బాల్యానికి దూరమవుతున్నారు
బ్రతుకుకు భరోస కరువైన బాల్యం

చదువుల సారాన్ని పొందుతూ
సంస్కార పుప్పొడిని వెదజల్లుతున్నారు
భావిభారత పౌరులు చిన్నారులు

బుడిబుడి నడకల బుడుతలవుతూ
అమ్మానాన్నల ఆశల పల్లకీలు వాళ్ళు
సాక్షాత్తు దేవుడి ప్రతిరూపాలు బాలలు

కల్లాకపటము ఎరుగని వారవుతూనే
అవనిలో ఆడిపాడే అందాల పువ్వులు
స్వచ్ఛమైన మీగడ తరగలు బాలలు

చిట్టిపొట్టి చిన్నారుల జీవితం ఎప్పుడూ
ఆడుతూపాడుతూ ఎదిగినపుడే ఆనందం
బాల్యజీవితం ఓ అందమైన మధురజ్ఞాపకం

–బొమ్ము విమల
9989775161

బడిలో విద్యార్థులు పాఠాలేవి వినకుంటే
పాఠాలను వినేలా గురువులు చేసుకోవాలి
బాలలు రేపటి తరపు వెలుగుబాటలు

పిల్లలు స్వచ్ఛమైన మనసులు కలవారవుతూ
మల్లెల్లా సువాసనా పరిమళాలు పంచుతారు
పువ్వు పుట్టగానే పరిమళించే చిన్నారులు

చిన్నారులు మెత్తని మట్టిముద్దలవుతూ
మలుచుకోవటంలోనే అమ్మానాన్నల ప్రతిభ
గురువులు చెక్కిన శిల్పాలు బాలలు

బాలలకు ఉపాధ్యాయులు చక్కనైన బోధన చేస్తేనే
జీవితాంతం గురువులను గుర్తించుకుంటారు
ఆచార్యదేవోభవ అన్న సూక్తికి నిదర్శనం గురువులు

తెలిసీతెలియని వయసులో తప్పటడుగులు వేస్తే
సరిచేయడం తల్లిదండ్రుల కనీస కర్తవ్యం
మొక్కై వంగని బాల్యం మానై వంగదు



– యలమర్తి అనూరాధ
9247260206

బాలలు విరిసే సిరిమల్లెలవుతూనే
నింగిలో మెరిసే తారకలవుతారు
దేశభవితకు దిక్సూచి చిన్నారులు

చిన్నారి పొన్నారి పాపలవుతూనే
అమ్మనాన్నల ప్రేమదీపాలవుతారు
ఆనందానికి పిల్లలు ప్రతిరూపాలు

నవ్వుల పరిమళాలను వెదజల్లుతూనే
పువ్వులమాలలను అందంగా అల్లుతారు
సుగంధానికి ప్రతిరూపాలు బాలలు

బాలల నవ్వులు విరిసే నవమల్లికలవుతూ
బాధలని మరిపించే మధురవీచికలు
బాలలు మకరందపు తేనియలు

తొలి ప్రధాని పండితనెహ్రూ జన్మదినాన
బాలలందరికీ అసలైన పండుగరోజు
భరతమాత ముద్దుబిడ్డలు బాలదీపాలు



– మానాప్రగడ సాహితి
9989370358

పిల్లలు పసిడినవ్వుల జల్లులవుతూనే
కల్లాకపటం ఎరుగని చిన్నారి ప్రపంచం
రేపటి భావిభారతానికి దివ్వెలు పిల్లలు

తల్లిదండ్రులు చేసిన అప్పులకు
పిల్లలు పడుతున్న తిప్పలు ఎన్నో
అప్పులు ఎప్పటికీ తీరని వెతలు

పలుకాబలపం పట్టే చేతులతోన
పారా పలుగు పట్టిన కార్మికులు
జీవనం కోసం కూలీ బతుకులు

చదువుకు దూరమై పాలేరుపనికి దగ్గరై
బానిస బతుకులు బతుకుతున్నరు
దిక్కుమొక్కూలేని అభాగ్యులు చిన్నారులు
గురువుల బోధనతో అక్షరాలను నేర్చి
డాక్టరు,ఇంజనీరులయ్యే మంచి అవకాశం
భావితరాలకు వారసులు బడిపిల్లలు



– జక్కు కృష్ణమూర్తిగౌడ్
9059674541

మల్లెల్లాంటి తెల్లని మనసు కలిగుండి
కల్లాకపటం ఎరుగని స్నేహకుసుమాలు
పిల్లలు అరమరికలు లేని ఆశాదీపాలు

కులమత భేదాలేవీ ఎరుగక
సమైక్యతాగీతం పాడే కోయిలలు
పిల్లలు భావితరాలకు వారధులు

విశాలభావపు పునాదులను కలిగిఉంటూనే
మాయలెరుగని అమాయకులు వాళ్ళు
పిల్లలు గగనతలాన ఎగిరే శాంతికపోతాలు

అసాధ్యాలను సుసాధ్యం చేసి చూపిస్తూనే
శాస్త్రరంగాలన్నింటిలో వీస్తున్న విజ్ఞానవీచికలు
పిల్లలు అద్భుతాలను సృష్టించే బాలమేధావులు

జన్మించిన మాతృభూమి గౌరవాన్ని కాపాడుతూ
భరతమాత కీర్తికిరీటంలో పొదిగిన జాతిరత్నాలు
పిల్లలు సంపూర్ణశక్తి గల దేశభక్తులు

జన్మనిచ్చిన వారి ఋణం తీర్చుకోగా
భువిలో వెలసిన ప్రేమమూర్తులు వాళ్ళు
పిల్లలు తల్లిదండ్రుల కనుపాపలు



– భైరోజు రాజశేఖర్
94417 60015

కల్లాకపటం తెలియనివాళ్ళవుతూనే
ప్రపంచాన్ని కుటుంబంలా భావిస్తారు
పిల్లలు స్వార్థమెరుగని నవ్వుల పువ్వులు

పిల్లలు ప్రేమ స్వరూపులైతేనే
ప్రతి వస్తువులో ఆనందం పొందుతారు
పిల్లలు తియ్యని ప్రేమకు ప్రతిరూపాలు

పిల్లలు ప్రశ్నించటం నేర్చుకుంటేనే
అవగాహనతో చదువుల్లో రాణిస్తారు
పిల్లలు ప్రశ్నించే చురకత్తుల వర్షాలు

పిల్లలు ఆటపాటలలో మునిగితేనే
శారీరక ఎదుగుదలతో పరిపూర్ణులౌతారు
పిల్లలు ఆటపాటలకు ప్రాణవాయువులు

పిల్లలను దండించటం ఒక మార్గమైతే
చురుకుతనం జడత్వంలోకి జారుకుంటుంది
పిల్లలు ప్రోత్సహపు ప్రతిభ వెలుగులు



– నందిగామ కిశోర్ కుమార్
9347229036

ఆటపాటలతో అలరిస్తూ ఉంటూనే
అందరికీ ఆత్మీయనేస్తంగా ఉంటారు
బాల్యం అంటేనే బలమైన అనుబంధం

నాన్న చిటికెన వేలుపట్టి నడిపిస్తుంటే
నవసమాజానికి బాటలు వేస్తున్నట్లుంది
నేటి బాలలే కదా రేపటి పౌరులు

వచ్చీరాని మాటలతో చిలిపిపనులు చేస్తూ
ఇల్లంతా ఒక ఒకటి చేసి ఆటాడిస్తారు
పిల్లల అల్లరి సాగరమంతా ఘోష

బాల్యమంతా మమతానురాగాలతోనే
అలరాడుతూ ఆత్మీయతను అందిస్తుంది
బాల్యం మూడు తరాల బహుమానం

తల్లిదండ్రుల పెంపకంలో మారాం చేసినా
తాతమ్మలతో చెలాయించేది బాల్యమే
తనివితీరనిది తాతామనవడి సంబరం.



– సృజామి
8639260193

నేటి మొగ్గలే రేపటి ఫలాలను ఇచ్చినట్లు
నేటి బాలలే రేపటి పౌరులవుతారు
నవభారత నిర్మాతలు మన బాలలు

బుడిబుడి నడకలను చక్కగా వేస్తూనే
చిలుకపలుకులు పలుకుతూ సంతోషపెడతారు
రేపటి సమాజానికి నడకలు బాలలు

బాలలు మల్లెపువ్వుల్లా పుష్పిస్తూనే
సుందర సుమధుర ఆనందాన్నిస్తారు
ఆనందమూర్తులు అందమైన బాలురు

నీటిచుక్క ముత్యపుచిప్పలో పడినట్లు
బాలురు మంచి పెంపకంలో పెరగాలి
కల్మషం లేనివారు ఎప్పటికీ బాలలే

బాలలు బోసినవ్వులు నవ్వుతూనే
కఠినమైన హృదయాలను కరిగిస్తారు
మనసులను దోచే నవనీతచోరులు బాలలు



– ఆర్. చెన్నయ్య
94416 15293



కల్మషము లేని కర్మయోగులవుతూనే
స్వార్థమసలే లేని సాధుజనులు వాళ్ళు
స్వచ్ఛమనసు కలిగినవారు బాలలు

సత్యం ధర్మం న్యాయం లకు వారసులవుతూనే
భారతీయ త్యాగనిరతికి నిలువుటద్దాలవుతారు
బంగారుతోటలో విహరించే పసిమొగ్గలు బాలలు

పాపపుణ్యమెరుగనట్టి కంటిపాపలవుతూనే
మనవ నాగరికతకు ప్రతిబింబాలవుతారు
చిలిపితనం చిందించే చిరునవ్వుల దూతలు

అక్షరాలు విడిచి ఇటుకలను మోస్తూనే
స్వేదజలాన్ని చిందిస్తూ శ్రామికులైనారు
బంగారు బాల్యం కూలీపనిలో ఆహుతి

ప్రత్యేక విద్యాక్షేత్రాలు ఆర్టీఐ చట్టాలున్నా
బాలకార్మిక నిర్మూలనకు ఆమడదూరం
రైలుబోగీ శుభ్రతలో బాల్యం బందీ



– సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు
9491357842

బాలలు విరబూసిన పువ్వులవుతూనే
అందమైన నవ్వులను చిందిస్తారు
బంగారుబాట వేసే భావిపౌరులు బాలలు

అక్షరాలు దిద్దాల్సిన అందమైన బాల్యం
వెట్టిచాకిరి నీడలో మసకబారుతుంది
బాల్యం వరమే ఎప్పటికీ శాపగ్రస్తంకాదు

కల్లాకపటం ఎరుగని బాల్యమంతా
ఆటపాటలతో మురిసి గడిచిపోయింది
బాల్యం ఒక అందమైన మధుర జ్ఞాపకం

బాల్యాన్ని మొగ్గదశలోనే చిదిమి వేయకుండా
భావిజీవితానికి బంగారు బాటలు వేయాలి
బ్రతుకురాత మార్చే నవభారతనిర్మాతలు బాలలు

ఇసుకగూళ్ళు కట్టుకున్న బాల్యమే
నేడు మట్టిపాలు అవుతున్నది
కేరింతలతో అల్లరి చేసేది బాల్యం



– సముద్రాల శ్రీదేవి
99498 37743

నిరంతరం చిరునవ్వులు చిందిస్తూనే
మనలోని అలసటను దూరం చేస్తారు
పసిపిల్లలు వెలుగులు పంచే పసిడిదివ్వెలు

అడుగులు వేస్తూ నట్టింట్లో నడయాడుతూనే
సంతోషాల సంబరాలు తీసుకువస్తారు
బాలలు నిరంతరం విరబూసే పువ్వులు

ముద్దుముద్దు మాటలతో మురిపిస్తూనే
ముచ్చటగొలుపుతూ హాయి కలిగిస్తారు
పసిపిల్లలు నిత్యం మెరిసే మేలిమిముత్యాలు

జాబిలమ్మలా ఇంటివెలుగై ఉంటూనే
ఇంట్లో సందడి చేస్తూ లక్ష్మీకళను తెస్తారు
బాలలు మురిపించే గగనపు సిరిమువ్వలు

హరివిల్లు వర్ణాలను రంగువల్లులుగా మురిపిస్తూనే
పండుగ వాతావరణాన్ని రోజూ కనిపించేలా చేస్తారు
పసిపిల్లలు ఎప్పుడూ దేవుని ప్రతిరూపాలు



–సత్య నీలిమ
95021 56813

పలకా బలపంతోనే లోకజ్ఞానం ఎరిగి
దేశానికి అసలైన విద్యవేత్తలవుతారు
దేశసౌభాగ్యానికి వెన్నుపూసలు బాలలు

తెలియని వెతలను దిగమింగుతూనే
నిత్యం నవ్వులతో మురిపిస్తారు
బోసినవ్వుల పువ్వులు బంగారు బాలలు

కల్లాకపటం ఎరుగని మనసులతో
కమ్మనైన కబుర్లను చెబుతూ కవ్విస్తారు
మనస్సును కుదుటపరిచే ఓషధలు బాలలు

పెద్దలకు అండదండగా ఉంటూనే
తియ్యని తీపికలలను పంచుతారు
బాలలు వెలుగులునింపే ఆశాజ్యోతులు

నిరంతరం అమ్మనీడలో మెసలుతూనే
అనుభవ మహోన్నతను చాటుతారు
బాలలు నిత్యాన్వేషక పరిశోధకులు



– కపిలవాయి వెంకటేశ్వర్లు
94940 19898







# పండుగలు ఎందుకోసం?



ఆకాశం అంచులదాక నడుస్తున్నా కూడా
హద్దు మనకు అందడం లేదు
నక్షత్రాలు మనల్ని చుట్టుముట్టినా
వెలుగులు దూరంగానే వున్నాయి
అవును! ప్రకృతి ఒక రుతి
ప్రకృతి మనిషిని తనలో సంలీనం చేసుకొంటుంది
రూసో అన్నట్టు ప్రకృతిని అధిగమించినపుడంతా
మనిషి కృత్రిమంగా రూపొందుతున్నాడు
జ్ఞానానికి మూలం హేతువు
హేతువు నశించిని చోట కార్య సిద్ధి జరగదు
దేన్నుండి దేనికి నడుస్తున్నావు
నీవు నడుస్తున్నావా! నడుస్తున్నట్లు భావిస్తున్నావా!
కాలం మీద ఆధిపత్యం వహించకుండా!
నీవు ఏమి సాధించలేవు? ఆలోచనలు, అనుభూతులు
సమతుల్యం కావాలి సుమా!
అనుభూతమైనదంతా జ్ఞానంగా పరివర్తితం అవుతుందా?
అప్పుడే బోధనలో జీవం వస్తుంది
నీ జీవితం కథల చుట్టూ తిరిగితే
నీ జీవితం మతం మత్తులో మునిగితే
కల్పిత కథనాలు నిన్ను ఆవహిస్తే
వాస్తవ జీవితం సంక్షుభితం అవుతుంది కదా!
నీ జీవితమే ఓ పెద్ద కథనం
మరో కథను నీవు అనుకరించడం ఎందుకు?
జీవితం కథనా కథనాల మధ్య ఓ వాస్తవం
అనుభూతమైందంతా వ్యక్తీకరణకు సాధ్యం కాదు
వ్యక్తీకరించిందంతా అనుభూతికి సాధ్యంకాదు
దేనికైనా ఘర్షణే ప్రేరణ
కార్యదీక్షే ముఖ్యం, కార్యశీలతే గమనం
చరిత్ర నిరంతరం చలనశీలనమైంది
నీవు సంకెళ్ళలో ఉన్నట్టు భావిస్తావు
అవి ఎప్పుడో తెగిపోయాయి
నీవు స్వేచ్ఛలో వుండి కూడా, స్వేచ్ఛకోసం కేకలేస్తున్నావు
సంఘం నిన్ను నియంత్రించే శక్తిని కోల్పోయింది
దానిదిప్పుడు ప్రేక్షకపాత్ర,
దాన్నిప్పుడు నీవు నడిపిస్తున్నావు సుమా!
సంఘం, వ్యక్తి ఆధార ఆధేయాలుగా నడుస్తాయి
అవి పరస్పర సంబంధితం, సరస్పర స్పోరకం కూడా
సంఘం బలహీనపడితే, వ్యక్తి బలహీనుడవుతాడు సుమా!
వ్యక్తి బలహీన పడితే సంఘం బలహీన పడుతుంది
మరోప్రక్క కల్పితమైన దేవుళ్ళ వైపు సంఘం పరుగెడుతోంది
ఎంతో ధనం వ్యర్ధంగా దగ్ధం అవుతుంది
ముక్కు, ముఖం లేని దేవుళ్ళ కోసం
రైళ్ళు పట్టకుండా జనం కిక్కిరిసిపోతున్నారు
తన మీద అవిశ్వాసం
దేవుళ్ళమీద విశ్వాసంగా విస్తరిస్తుంది
విజ్ఞానంపట్ల అనాసక్తత పెరుగుతుంది
భూమి మూలాన్ని తెలుసుకొనే కంటే
'భూమి' దేవతను కొంటే
సులభంగా వుంటుందనుకొంటున్నారు
శాస్త్ర జ్ఞానాన్ని జీవితానికి
అన్వయించుకొనే క్రమం తగ్గుతుంది
కృష్ణుడు జరాసంధుణ్ణి చంపాడు,
కృష్ణుడు కంసుణ్ణి చంపాడు
కృష్ణుడు నరకాసురుణ్ణి చంపాడు
'అందుకే దీపావళి చేసుకొంటున్నాం' అంటున్నారు
కృష్ణుడు పూతన అనే దళిత స్త్రీ రొమ్ము కొరిక చంపాడు
నరకాసురుని ముందు సత్యభామ నృత్యం ఎందుకు?
నరకాసుర రాజును నేరుగా చంపలేకేగా!
పూతననే దళిత స్త్రీని చంపడం ఘోరం
అని మీ కనిపించడం లేదా?
జరాసంధుణ్ణి చీల్చి అటు ఇటు విసరడం దేనికి?
ఇవన్నీ దళిత రాజ్యాలను కూల్చడానికేగా
ఎందుకు చంపడాన్ని పండగ జేస్తున్నారు?
దానివల్ల హంతక సంస్కృతి విస్తరించదా?
ఇవాళ జైళ్ళలో వున్న హంతకులంతా
ఏ సంస్కృతికి ప్రతీకలు?
నేరసంస్కృతికి ఎందుకు మీరు పట్టంగడుతున్నారు?
బుద్ధుడు ఎవరినీ చంపకుండా
ప్రపంచమంతా విస్తరించలేదా!
అవును! పండగంటే ఇతరులకు
సహాయం చేయడం కాదా! ఏమిటి ఈ వైరుధ్యం?
జ్ఞాన సంపన్నులుకండి! వివేచనతో జీవించండి
నూత్న సంస్కృతీ వికాసానికి పతాకలెత్తండి
అప్పుడే! భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం.

**- కత్తి పద్మారావు**
సెల్:9849741695

# వేదా చంద్రయ్య సంస్మరణ సభ

వేదాచంద్రయ్యగారి సంస్మరణ సభ ఆదివారం సాయంత్రి వారి స్వగృహంలో ఉదయ కళానిధి ఆధ్వర్యంలో జరిగింది. కవి పండితులు వారి శ్రేయోభిలాషులు, మిత్రులు, కుటుంబ సభ్యులు సంస్మరణ సభలో పాల్గొన్నారు. వక్తలు వారి సాహితీకృషిని, సేవలను వ్యక్తిత్వాన్ని కొనియాడారు. వేదాచంద్రయ్యగారి అమృత వాక్కులు 14 సంపుటాలను ఒకే పుస్తక రూపంలో తీసుకొచ్చి విద్యార్థులకు అందించాలని తెలిపారు. వారి పేరుమీద వివిధ రంగాలలో రాణించిన వారిని గుర్తించి జీవిత సాఫల్య పురస్కారాలు వారు నెలకొల్పిన వేద ధర్మశాస్త్ర పరిషత్ ద్వార ఇవ్వాలని అక్షరసేవలో వేదా చంద్రయ్యగారిని చూడాలని వక్తలు వారి కుమారుడైన వేదా సంపత్‌కుమార్‌కు తెలిపారు. కవి పండితులను వున్నప్పుడు ఆదరించినట్లే తదనంతరం వారు రచించిన గ్రంథాలలోనే వారిని వారి భావాలను చూస్తు స్మరించడం నేటి ఆధునిక కవుల నైతిక బాధ్యత అని వక్తలు తెలిపారు. సభకు ఆచార్య మసన చెన్నప్ప అధ్యక్షత వహించగా, డా॥ శ్రీరంగాచార్యులు ముఖ్య అతిథిగా,బైస దేవదాసు, కూర చిదంబరం, డా॥ మక్కపాటి మంగళ, సోమ సీతారాములు, దేవసాని సుదర్శన్, డా॥ రచ్చా యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఉదయ కళానిధి అధ్యక్షులు శిఖా గణేశ్ సభను సమన్వయ పరిచారు. వేద చంద్రయ్య కుమారుడు వేదా సంపత్ మాట్లాడుతు..వక్తలు తెలిపినట్లుగా వేదాచంద్రయ్య రాసిన సాహిత్యాన్ని ప్రచురించడమేగాక ప్రతి సంవత్సరం ఒకరికి జీవన సాఫల్య పురస్కారం అందజేస్తామని తెలిపారు.



వేదాచంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

# అక్షరం మూగవోయింది

అక్షరం మూగవోయింది
తనను బాల్యం నుంచీ ఆలింగనం చేసుకున్న
ఆ ప్రేమికుడు ఏడీ?
తనను మృధువుగా పలకరిస్తూ వచ్చిన
ఆ స్నేహ వాహిని ఏదీ?
తనను ఆర్ద్రతతో స్పృశించిన ఆ కలం ఏదీ?
అక్షరం ఆవేదన చెందుతోంది
తన చరణాలను అయ్యప్ప చరణాలకంకితం
చేసిన ఆ భక్తాగ్రేసురుడేడీ?
తన హృదయాన్ని అమృతవాఙ్మయం చేసిన
ఆ కవన వనమేదీ?
అక్షరం అశ్రువుల రాలుస్తోంది-
తన సొగసుకు ఆలోచనలద్దిన ఆలోచనాలేవీ?
తన ఆహార్యంతో కవిమిత్రుల మేధకు ఆహారం
అందించిన ఆ అన్నదాత ఏడీ?
అక్షరం రోదిస్తోంది
తనను సాత్వికమందాకినిలో సుస్నాతను చేసిన
ఆవదాన్యుడేడీ?
తనను వినయ నయనకమలాలలో దాచి
ఆత్మీయులకందించిన ఆ ఆత్మబంధువేడీ?
అక్షరం విలపిస్తోంది
తన పరివారానికి తన స్నేహితులకు
ఎరుకలేని చేతినందించిన
ఉదారశీలి ఏడి?
అయినా ఆశగా ఎదురు చూస్తూనే ఉంది అక్షరం
మళ్లీ మనిషిగా, మనీషిగా ఆధ్యాత్మికవేత్తగా
మితభాషిగా, స్మితభాషిగా
మృదుభాషిగా మళ్లీ అలాగే మళ్లీ అలాగే
పుడమిపైన అడుగెడతాడని
ఆశగా- ఆబగా- ఎదురుచూస్తూనే ఉంది
చూస్తూనే ఉంటుంది అక్షరం.

*(3-11-2019న స్వ. వేదాచంద్రయ్యగారి సంస్మరణ సభలో చదివిన కవిత)*



**- చిమ్మపూడి శ్రీరామమూర్తి**
సెల్: 9704177270



# ఫోర్‌మెన్ సాంబశివరావు

## అనుభవాలు పాఠాలు-2

*ప్రతి వ్యక్తీ, ఈ అనంత జన ప్రవాహంలో 'సమూహంలో ఒకడు'గా జీవిస్తున్నవాడే!*

*ప్రతివ్యక్తీ, రోజూ ఏవేవో కొత్త అనుభవాల్ని ప్రోవు చేసుకుంటున్నవాడే!*

*ప్రతివ్యక్తీ, బ్రతుకుబడిలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థే!*

*ఆ వ్యక్తిని ఆవరించుకుని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు, ఉద్యోగంలో చేరాక పై అధికారి, సహ ఉద్యోగి, సబార్డినేటులు, ఆ సంస్థతో లావాదేవీలు నడిపే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, ఇంటిచుట్టూ ఉన్న ఇరుగు పొరుగూ, రోజూ 'వాకింగ్'లో కనబడే పరిచయస్తులు ఇలా వీళ్ళందరితోనూ అనుభవాల్ని ప్రోవుకుంటున్నాడు.*

*ప్రతీ అనుభవం- తనది కావచ్చు లేదా ప్రక్కవారిది కావొచ్చు- లోంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటంలోనే విజ్ఞత ఉంది. ఏడున్నర దశకాల కూర చిదబంరం జీవితంలో ఎదురైన అనుభవాలు, వాటిలోంచి నేర్చుకోగలిగే పాఠాలే ఈ "అనుభవాలు-పాఠాలు"-!*

*- సంపాదకులు*

సాంబశివరావు మా ఫ్యాక్టరీలో ఫోర్‌మెన్. ఆయన జాయిన్ అయి సుమారు ఏడాది కావస్తోంది. అంత కొద్ది సమయంలోనే ఆయన అందరికీ తలలోని నాలుక అయ్యాడు. ఏదైనా పని పురమాయిస్తే ఆయనకు సంబంధించినదైనా, ఆయనకు సంబంధించినది కాకపోయినా బాధ్యతాయుతంగా నిర్వర్తించేవాడు. ఫ్యాక్టరీ ప్రొడక్షన్‌కు సంబంధించినదైనా, స్టోర్సుకు సంబంధించినదైనా ఒక్కోసారి వాచ్‌మెన్ గేటు దగ్గర లేకుండా పోతే ఎంట్రీ రిజిస్టర్‌లో వ్రాయటం అయినా, ఏ పని పురమాయించినా ఆయన నోటివెంట 'సారీ సర్ ఇది నా బాధ్యత కాదు' అన్నమాట వచ్చేది కాదు.

ఫ్యాక్టరీలో ఆయన డ్యూటీలో ఉన్నాడంటే మా వర్క్స్ మేనేజర్ కూడా నిశ్చింతగా ఉండేవాడు.

ఏదైనా అవసరం వస్తే, డైరెక్టుగా మా ఎం.డి. గారి పి.ఏ.ను కూడా సంప్రదించకుండా ఎం.డి. గారి తలుపు తట్టి లోనికి వెళ్ళేంత చనువు ఆయనకు ఉండేది.

ఫ్యాక్టరీలోని సంబంధాలు మరింత దృఢంగా కావాలని మా కంపెనీ అప్పుడప్పుడు 'సోషల్ గాదరింగ్' ఏర్పాటు చేసేది. ఈ గాదరింగ్స్‌కు వాళ్ళ వాళ్ళ అర్ధాంగులతో సహా రావాలన్న నియమం ఉండేది. ఇలాంటి గాదరింగ్స్‌లో సాంబశివరావు వాళ్ళావిడ "ఇల్లూ, పిల్లలు, ఇవేం ఆయనకు పట్టవు. ఇరవయి నాలుగు గంటలూ ఫ్యాక్టరీ ధ్యాసే" అంటూ సణుక్కునేది.

ఓనాడు అప్పుడే లంచ్‌బ్రేక్ ముగిసినట్లుగా బెల్ మ్రోగింది. మాకు డైనింగ్ హాలు ఉన్నా అవసరాన్నిబట్టి పనుల ఒత్తిడిబట్టి నా కేబిన్‌లోనే ఫైళ్ళు చూస్తూ, లంచ్ ముగించటం చేస్తుంటాను.

మా ఏ.ఓ. (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) కేబిన్‌లోకి వచ్చాడు. కూర్చుండమని సైగ చేసినా కూర్చోకుండా "సాంబశివరావు రిజైన్ చేస్తాడట" అన్నాడు. నేను ఊహించని వార్త ఇది.

"ఇమ్మీడియట్‌గా రిలీవ్ చేయాలంటున్నాడు" అన్న ముక్తాయింపు. 'ఔనా'! అన్నట్లు ముఖం పెట్టాను. నమ్మలేకపోయాను. రిజిగ్నేషన్ కాగితం ముందుంచాడు. "వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా ఇస్తున్నాను" అని ఉంది.

ఆ కంపెనీలో చాన్నాళ్ళ అనుభవం నాకు. అందుకని ఎన్నో విషయాలు ఫైనాన్సుకు సంబంధం లేనివి కూడా నా దగ్గరకు వస్తుంటాయి. "ఆయన ప్రాముఖ్యత తెలుసు కదా! నువ్వోసారి చెప్పి చూడు" అంటూ మధ్యలో డిస్ట్రబ్ చేసినందుకు సారీ చెప్పి వెళ్ళిపోయాడు ఏ.ఓ.

హడావుడిగా లంచ్ ముగించి సాంబశివరావు టేబిల్ దగ్గరకు వెళ్ళాను. మనిషి చాలా కోపంగా, ఏదో అవమాన భారాన్ని మోస్తున్నట్లు కనిపించాడు. "ఒకసారి నా దగ్గరకు వస్తావా?" అడిగాను. నలుగురిలో, కొలీగ్స్ మధ్య అన్ని విషయాలూ, ఆత్మీయంగా కమ్యూనికేట్ చేసుకోలేం.

కాసేపటికి ఆయన నా కాబిన్‌లోకి వచ్చాడు. మనిషి చాలా అలజడి పడుతూ, అది పైకి కనిపించకుండా అదిమి పెడుతున్నట్లు ఆయన ముఖం చెబుతోంది.

"రాజీనామాకి కారణం చెబుతావా?" అని అడిగాను.

ఎదురుగా ఉన్న మంచినీళ్ళు గటగటా త్రాగి, కాస్త సమయం తీసుకున్నాడు.

"మనమంతా ఉద్యోగాలు చేస్తుంది ఎందుకు సార్?" అన్న ప్రశ్న వేసి, జవాబుగా తానే "మనం తింటున్న నాలుగు మెతుకులు సంపాదించటానికి. ఆ నాలుగు మెతుకులు కూడా కాస్త ప్రశాంతంగా తినలేకపోతే, ఈ ఉద్యోగమూ, సంపాదనా, ఎందుకు సార్!"

కాస్త సమయం తీసుకుని చెబుతూ పోయాడు. "మన వర్క్స్ మేనేజర్‌గారికి ఎన్నోసార్లు చెప్పాను. లంచ్ అవర్లో నన్ను పిలవద్దని. అత్యవసరం కాని విషయాలకి కూడా. లంచ్ ప్రక్కకు బెట్టి తన వద్దకు రావాలంటున్నాడు".

కథంతా అర్థం అయింది.

మా వర్క్స్ మేనేజర్ ఆయన స్థాయికి తగ్గకుండా, సాంబశివరావుకు సారీ చెప్పాడు.

మళ్ళీ ఇలాంటి కంప్లయింట్స్‌తో సాంబశివరావు వంటి సహోద్యోగులు నా వద్దకు రావాల్సిన అవసరం వారికి కలుగలేదు.



**-కూర చిదంబరం**
సెల్: 8639338675

# ఊరు అందగ ఉన్నది

భూమి ఎట్ల తిరుగుతదో
తెలువదు కానీ
చెట్టు గుట్ట అడవి ఆకాశం
కనిపించని గాలి
కాళ్ల కింద నేల
పొలాలు ఇండ్లు ఒకటనా!
అన్నింటినీ దాటొచ్చే
నాలుగు చక్రాల చప్పుడు వింటే
పోయే ప్రాణం లేచి వచ్చినట్టు!

అల్ప జీవుల
ఆత్మబంధువు !
చుట్టమోలె వచ్చిన
ఊరు తీయని చెలిమె!
చాయా డబల్ రొట్టో
కడుపు నిమిరి
ఆతిథ్యమిచ్చేది
చలికి ఎండకూ వానకూ నిలబడి
కుతకుత ఉడికే
ఇంజన్ ప్రాణం సుతం
అంగట్ల ఆగమైన మనిషిని
వెతికినట్లు వెతుక్కుంటూ
తనవారిని తోలుకొని
నిండు గర్భిణిలా కదిలి వెళ్ళేది
ఎందరు ఎక్కినా
ఇంకా ఒకరికి చోటున్నట్టు
చెయ్యి ఆపి నంతనే ఏనుగంత ఆనందపడి
తలవంచి ఎదురునిలుచునేది
ఎందుకు పెట్టారో ఎర్రబస్సు అని పేరు కానీ
ఎప్పుడూ పచ్చగా ఉండాలని ఆశ పడింది
ఏ చీకట్ల పయనించినావెలుగై నిండాలని
రెండుకళ్లను ఇంత పెద్దగ తెరుచు కునేది
ఎన్ని విఫలాలను చూసింది!
ఎన్ని టికెట్లను మలిపి రాసింది!
ఎన్ని కలలను! ఎన్ని కన్నీళ్లను !
కార్యాలను కలిమిలేములనూ
బడ్డు చేర్చింది!
పిల్లా జెల్లా
తాత తండ్రులనూ
మోసిన తరాల జన్మ బంధం
ఎక్కడ బయలుదేరి
ఎక్కడ నిద్ర చేసి
ఎక్కడికి కెక్కడికో వెళ్లి పోయే ఆవారా మసిషి
ఒక దేశ దిమ్మరి
ఒక ప్రవక్త
రాక
కడపు దహించు కుంటూ
గుండెలు గాయపడి
మనసిచ్చి ఊరుచూడకా
ఎన్ని రోజులయింది
బోనాల వేప కొమ్మా
బతుకమ్మ తంగేడు పువ్వు
లేడి పరుగూ
దసరా పాలపిట్టా
తూర్పు కొండల సందునుండి
సూర్యుని కన్నా ముందొచ్చేనిన్ను
తలచుకుంటున్న తలపులై
బోసి పోయిన ఊరు
ఊరు ఊరంతా అందగున్నది.

**-బెల్లంకొండ సంపత్ కుమార్**
సెల్:9908419151

# ప్రగతి రథం

కాళ్లు చేతులాడిస్తూ
కళ్లలో ఒత్తులేసుకుని, దారి తీస్తూ
వంకరటింకర తిప్పి, వేగాన్ని అదుపు తెచ్చి
వాహన శ్రేణికి సైతం చిరునవ్వుతో దారి చూపి
చిన్న పెద్ద తేడా లేక చేయి చాపితే నిలిచి
హారన్ మోటు పల్లె పట్నం కలిపేటి డ్రైవరన్న
నేడు నీ పయ్య కదలాడకుంటే
జనజీవనం స్తంభించిపాయే
ప్రజా రవాణాకు చిహ్నమైన పల్లెబస్సు
నిశబ్ద సాగరమై కన్నీరు పెట్టవట్టే
నేడు నడిచే బస్సులు తీరు నీటిబుడగే
మనమున దాగిన రైట్ రైట్ పిలుపుతో
పుష్పకవిమానంలా ఎత్తుఒంపుల గడబిడ
సడెన్ బ్రేకులు సరిగమ రాగాల తోపులుంటేనే
పల్లె జనుల నడకసాగి, ప్రగతి ప్రతిబింబిస్తది
హక్కుల సాధనకై ఆర్టీసీ పోరులో
నిర్బంధపు ఎత్తులన్ని చిత్తులే
సమస్యలు జటిలమయితే సకల జనుల సమరమే
ఎదలో దాచిన భాసలు మరిచి
కడుపు చీల్చుకుంటే ఏం లాభం...?
పరివారం వుందని పొంగిపోయి
సేవచేసిన సైన్యాన్ని మరవడమేలా..?
చుట్టూ ఉన్న చీకటిని కడిగి
స్నేహస్తమిచ్చి రహదారులలో నడిస్తే
పల్లె ప్రగతి కొమ్మైనా బస్సు పరిగెత్తి
అభివృద్ధి పురోగతిలో అగ్రగామిగా నిలుస్తుంది
ఆలోచన వలదు, ఆలస్యమేలా....?
ఆర్టీసీ కార్మికుల ఆదుకోవడమే సబబు.....



**-ఉండ్రాల రాజేశం**
9966946084




